క్లుప్తంగా

16న సహస్ర తులసీ అర్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ఈ నెల 16న ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీ పూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

విద్యార్థినులకు నైపుణ్య సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీయర్ గ్రోత్‌పై నిర్వహించిన ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. పరిశ్రమలకు అవసరమైన వివిధ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి మాట్లాడుతూ ఉత్తమ ప్లేస్‌మెంట్స్ సాధించేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ జేకేసీ కోఆర్డినేటర్ డి.అరుణపద్మ, కోర్సు ట్రైనింగ్ అధికారి కె.అనూష, డి.ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.52 వేల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి సూర్య

మహారాణిపేట : మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజాసేవలో భాగంగా బుధవారం పది మంది రోగులకు రూ.50 వేలు, మరో అవ్వకు రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గణేష్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు వాసుపల్లి సూర్య బాధితులకు సాయం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాల ఇంటికి వెళ్లి పది మందికి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున అందజేశారు. ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు సొంత నిధులతో ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ దాతృత్వం పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని నర్సుల ధర్నా



కేజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న నర్సులు

మహారాణిపేట : కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు అందరినీ రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ అయ్యేంత వరకూ 100% గ్రాస్ ఇవ్వాలని కోరుతూ నర్సులు ఆందోళనకు దిగారు. బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి కార్యాలయం ఎదుట వేర్వేరుగా ధర్నా చేశారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కి అవకాశమివ్వాలని, విధి నిర్వహణలో మరణించిన స్టాఫ్‌కి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నర్సులు కోరారు. ధర్నాలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో చరిత్రాత్మక మార్పులు

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- రూ.1.18 కోట్లతో అచ్చియ్యమ్మపేట పాఠశాలలో వసతులు



అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాల



ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : పేదింటి పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక మార్పులు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. నిజమైన అభివృద్ధి అంటే ఏంటో సీఎం జగన్ చేసి చూపిస్తున్నారని కొనియాడారు. జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి నేతృత్వంలో అచ్చియ్యమ్మపేటలో రూ.1.18 కోట్లతో మౌలిక వసతులు కల్పించి ఆధునికీకరించిన ప్రాథమిక పాఠశాలను గణేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాణ్యమైన విద్య, కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. విద్య ద్వారా పేద పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. రోడ్లు, పెద్ద పెద్ద భవనాలు వుంటే ప్రజలు అభివృద్ధి చెందినట్టు కాదన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే జగనన్న లక్ష్యమన్నారు.

అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాలకు రూ.1.18 కోట్లు కేటాయించారంటే విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. పిల్లలంతా చదువుకోవాలని మహిళలకు అమ్మ ఒడి పథకం అమలు చేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. 34వ వార్డు అభివృద్ధికి కార్పొరేటర్ తోట పద్మావతి చేసిన కృషిని కొనియాడారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్నిమాంబ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ లండా రమణ, పార్టీ సీనియర్ నాయకుడు లింగం శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ఎంత మంది కలిసొచ్చినా గెలిచేది జగనన్నే

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- నియోజకవర్గంలో ఉత్సాహంగా 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కిట్స్ అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలో మేము సిద్ధం.. మా బూత్‌లు సిద్ధం కార్యక్రమం బుధవారం విజయవంతంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన జగదాంబ జంక్షన్ సమీపాన అంబికాబాగ్ రామాలయ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మేము సిద్ధం.. మా బూత్‌లు సిద్ధం కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఇప్పటి నుంచి ఎన్నికల సమయాన్ని 41 రోజుల పాటు చేసే పవిత్ర దీక్షలా భావించి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కర్నీ కలిసి సమస్యలు ఇంకేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకోవాలన్నారు. గ్యాప్ లేకుండా దక్షిణ నియోజకవర్గాన్ని స్ట్రాంగ్‌గా తయారు చేయాలన్నారు. వార్డులో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు, మండల ఇన్‌చార్జ్‌లకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. పేదలకు సీఎం జగన్ చేసిన మేలే గెలిపిస్తున్నప్పటికీ.. మూకుమ్మడిగా వస్తున్న ప్రత్యర్థుల కుయుక్తులను తిప్పి కొట్టాలన్నారు. దక్షిణ నియోజకవర్గంలో 13 వార్డులకు సంబంధించి 235 బూతుల ఇన్‌చార్జ్‌లు, వార్డు నాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన, గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాల కింద రూ.2.65 లక్షల కోట్లు పంపిణీ చేసిన సంగతి ప్రజలకు వివరించాలన్నారు. గతంలో టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు తమకు నచ్చిన వారికే పథకాలు అందించారని ఈ సందర్భంగా వాసుపల్లి గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలన్నా, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఉండాలన్నా సీఎంగా వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి 175 నియోజకవర్గాల్లో మొదటి అత్యధిక మెజార్టీని మనమే సాధించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, పలువురు కార్పొరేటర్లు, వార్డు నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డైరెక్టర్లు, పలు ఆలయాల చైర్మన్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో జి.వి.రమాబాయి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు శుభ్రం చేయండి



కాన్వెంట్ జంక్షన్ వద్ద గెడ్డను పరిశీలిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ: గెడ్డలను శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన జోన్ పరిధిలో కాన్వెంట్ జంక్షన్ వద్ద ఉన్న గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కెనాల్ ద్వారా సముద్రంలోకి ప్రవహించే మురుగునీటికి వ్యర్థాలు అడ్డుపడుతుండడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందన్నారు. దీంతో మురుగు గెడ్డల్లోనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. జోన్ పరిధిలో ఉన్న ఇటువంటి గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రామకృష్ణ జంక్షన్ నుంచి పోర్టు ప్రధాన గేటు మీదుగా చిలకవీధి వరకు ఉన్న కెనాల్‌ను కూడా శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ కవయిత్రి మొల్ల



కవయిత్రి మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌వో మోహన్ కుమార్, తదితరులు

మహారాణిపేట : కవయిత్రి ఆతుకూరి మొల్ల దేశం గర్వించదగ్గ మహిళ అని, భావితరాలకు స్ఫూర్తిప్రదాత అని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. తెలుగు భాషలో మొట్టమొదటి కవయిత్రిగా రామాయణ కావ్యాన్ని రాసి అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో కవయిత్రి మొల్ల జయంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీదేవి తదితరులు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మొల్ల జీవిత విశేషాలను తెలిపారు. సరళమైన తెలుగు పదాలతో, వాడుక భాషలో రామాయణ కావ్యం రచించి తెలుగు భాషకు వన్నెతెచ్చిన మహనీయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు డి.చిరంజీవి రావు, వి.వి.ఎస్.మూర్తి, వి.రవీంద్ర బాబు, వై.వి.రమణయ్య, కె.కనకరావు, రామలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- ప్రత్యేక శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఆరిలోవ: మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గురజాడ కళా క్షేత్రంలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కిమ్స్, మెడికవర్ సంయుక్తంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎంపీ, పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉండేలా వార్డుల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా నైట్ షెల్టర్లు అయిన టీఎస్సార్ కాంప్లెక్స్, భూపేష్‌నగర్, పెదవాల్తేరులో రెడ్‌క్రాస్ సొసైటీకి మూడు వాటర్ ఫిల్టర్లు అందజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వైవీవి సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కట్టమూరి సతీష్, పార్టీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు కె.కె.రాజు, అదారి ఆనంద్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, జీవీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పాపునాయుడు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పెండింగ్ ఫారాలు పరిష్కరిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ సీపీ ఫకీరప్ప, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎటువంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ ఎ.మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. పెండింగ్ దరఖాస్తులు, ఎపిక్ కార్డుల తయారు, ముద్రణ, డెలివరీ, ఎన్నికలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలు, ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఎటువంటి ఫారాలు పెండింగ్‌లో ఉండకూడదని, ఆ రోజు నుంచి ఎటువంటి చేరికలు, తొలగింపులు చేయవద్దని కలెక్టర్లకు సీఈవో స్పష్టం చేశారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో 20,635 వరకు ఫారం 6, 7, 8లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి పూర్తి చేస్తామన్నారు. ఐదు లక్షల ఎపిక్ కార్డులకు గానూ 4.8 లక్షల కార్డులు జిల్లాకు చేరాయని, తపాలా శాఖ ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఏడు ఫిర్యాదులకు గానూ ఐదు పరిష్కరించామని వివరించారు. జేసీ కె.మయూర్ అశోక్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఈఆర్వోలు పాల్గొన్నారు.

పోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు సాంబమూర్తి ఏసీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, వీసెజ్ జేడీసీ రోషిని అపరంజి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో ఆధునికీకరించిన సాంబమూర్తి ఆడిటోరియాన్ని డా.అంగముత్తు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోర్టులో చక్కని పని వాతావరణం కల్పించడంలో మహిళా ఉద్యోగులు అవిరళంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో పోర్టులో మహిళా ఉద్యోగుల సంఖ్య మరింత పెరగాలని చైర్మన్ ఆకాంక్షించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగినులను చైర్మన్ సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పోర్టులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీసీఎల్ స్వామి, సెక్రటరీ వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టా అందజేస్తున్న దొడ్డి బాపూ ఆనంద్



పట్టా అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

డాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ కొనసాగుతోంది. జీవీఎంసీ 34వ వార్డులో కార్పొరేటర్ తోట పద్మావతి అచ్చియ్యమ్మపేట స్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిధిలో 1,450 మంది లబ్ధిదారులు వుండగా 150 మందికి పట్టాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాస్, నాగమణి, వేచలపు రాజు, వేంకటేష్, డి అప్పారావు, మేరుగు శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

◆ జీవీఎంసీ 31వ వార్డు పరిధి ఎస్‌బీఐ కాలనీ సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాలతో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ పలువురు లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కాండ్రేగుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల జాతీయ స్థాయి సమావేశం రేపు



మాట్లాడుతున్న కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే

డాబాగార్డెన్స్ : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో జాతీయ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే తెలిపారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో అనేక చట్టాలున్నప్పటికీ వినియోగదారులకు ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అందుకే శుక్రవారం జరిగే సమావేశంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం కోసం వివిధ ప్రభుత్వ శాఖలను ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ మురళీనాథ్, సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు పీవీజీ విశ్వనాథ్, దుర్గారావు, చంద్రశేఖర్, పీఎస్ ప్రసాద్‌రాజు, బీఎస్‌బీ శంకర్, జీవరత్నం, వెంకటలక్ష్మి, సాగర్, జీవన్, చంద్రమౌళి, కల్యాణ్, జుగల్, శ్రీధర్, ఇక్బాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశాఖ నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపుదాం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపి.. జిల్లా, రాష్ట్ర, దేశ సమస్యలపై ప్రశ్నించే అవకాశం కల్పిద్దామని మాజీ ఎమ్మెల్యే, సినీ నటుడు బాబూమోహన్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఏ పాల్, ఆయన అన్న డేవిడ్‌రాజులతో తనకు 30 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని, ఈ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున ప్రచారం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనను కాకినాడ లేదా గాజువాకల నుంచి పోటీ చేయమని కేఏ పాల్ కోరారని, తాను అందుకు సిద్ధంగా లేనని తెలియజేశానన్నారు. బీజేపీ తనను మోసం చేసిందని, ఆ ఘటనతో ఇక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కేఏ పాల్‌కు ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మధ్య కాలంలో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే పరిస్థితి వస్తే తాను కొంటానని కూడా ఆయన అన్నారని బాబూమోహన్ గుర్తుచేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని, ఇది ప్రారంభం మాత్రమేనన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు ఎన్నాళ్ల నుంచో నడుస్తోందని, ఇప్పుడది బహిర్గతమైందని చెప్పారు.

17న ఎల్లమ్మ జాతర

- 16న తొలేళ్లు నిర్వహణకు ఏర్పాట్లు



ఎల్లమ్మ దేవాలయం

డాబాగార్డెన్స్ : భక్తుల కొంగుబంగారంగా ఎల్లమ్మ తోటలో పూజలందుకుంటున్న ఎల్లమ్మ జాతర ఈ నెల 16, 17న నిర్వహించనున్నారు. 16న తొలేళ్ల ఉత్సవం, 17న జాతర జరపనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తులు శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు. ఎల్లమ్మ జాతర వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.పద్మావతి తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు ప్రసాదం అందజేయనున్నామని తెలిపారు.

అరకు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో సీపీఎం పోటీ

- గాజువాకలో కూడా..

డాబాగార్డెన్స్: అరకు పార్లమెంట్ స్థానం, అరకు, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం ప్రకటించారు. విశాఖ జిల్లా సీపీఎం విస్తృత స్థాయి సమావేశం బుధవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ, పాడేరు జిల్లా అటవీ ప్రాంత పరిరక్షణకు సీపీఎం అనేక రూపాల్లో ఉద్యమిస్తోందన్నారు. బీజేపీకి సహకరిస్తున్న రాజకీయ పార్టీలను ఈ ప్రాంతాల నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం అభ్యర్థులను చట్టసభలకు పంపేందుకు ప్రజలను సిద్ధం చేయాలని కార్యకర్తలకు లోకనాథం సూచించారు.

ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ వాయిదా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించాల్సిన బహిరంగ సభ వాయిదా పడింది. తెలంగాణ సీఎం కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు సభను మర్నాడుకు వాయిదా వేశారు. 16న అదే మైదానంలో నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.